# ఆశ

-ఎమ్. సి. అంజనేయులు

అవి ఛండీఘర్‌లో నేను పీడియాట్రిక్‌లో పి.జి. చేస్తున్న రోజులు. చిన్న పిల్లల వార్డులో ఓ పక్కమీద పదేళ్ళ బాలిక పడుకొని వుంది. ఆ బాలిక పేరు ఆశ. ఆ ఉదయమే ల్యుకేమియా వ్యాధి నిర్ధారణతో ఆ వార్డులో అడ్మిట్ అయింది. పసిమి వర్ణంతో మిసమిసలాడుతూ అందంగా వుందా అమ్మాయి. తల్లిదండ్రులకు- ఆ పాపంటే ప్రాణంలా వుంది- "బేటీ.. బేటీ" అంటూ ఆశను అంటిపెట్టుకొని కూచున్నారు. తమ గారాబాల పాపకి ల్యుకేమియా అంటే వారు నమ్మలేకపోతున్నారు.

ట్రీట్‌మెంటు ప్రారంభమయింది. ల్యుకేమియా ఎలాంటి ప్రాణాంతక వ్యాధో, ఆశ అమ్మా నాన్నలకు వివరించి చెప్పాం. ఒక్కోమారు చికిత్స జరుగుతున్నప్పుడు కాంప్లికేషన్స్ తలెత్తడం వల్ల ల్యుకేమియా వ్యాధిగ్రస్థులు మరణించవచ్చుని కూడా వారికి చూచాయగా వివరించాం.

అమ్మా నాన్నలని, తన చిట్టి చెల్లెల్ని, స్నేహితురాళ్లని, ఆ మాటకొస్తే ఈ లోకాన్ని, ఏ క్షణాన్నయినా వదిలి వెళ్ళిపోతుంది ఆశ!

ఆశ తల్లిదండ్రులు నిరాశకు లోనయ్యారు. చిన్నారి ఆశ మాత్రం ఎదిరించి పోరాడే గుండె ధైర్యాన్ని కూడగట్టుకుంది.

చికిత్స ప్రారంభించిన మొదటి నాలుగు వారాల్లోపలే రోగం వికటించి రోగి మరణించడం, డాక్టరుగా నాకు స్వీయ అనుభవమే. కాని, ఆశ అదృష్టం బాగుండి ఎలాంటి అనర్థాలు చోటుచేసుకోలేదు. నెమ్మది నెమ్మదిగా ఆశలో బ్రతుకుతాననే ఆశ బలపడింది. తలమీద నుండి గుత్తులు గుత్తులుగా వెంట్రుకలు రాలిపడడం ఆశ గమనించింది. కానీ, ఆశ నిరాశ పడలేదు. క్యాన్సర్ని నయం చేసేందుకు వాడే మందులు నిలుపుదల తర్వాత, తలమీది వెంట్రుకలు తిరిగి మొలకెత్తుతాయని ఆశకు ఇదివరకే తెలుసు.

బాధను భరిస్తూనే ప్రతిదినం క్రమం తప్పకుండా ఇంజెక్షన్లు తీసుకుంటూనే వుంది ఆశ. ఆ అమ్మాయి ఆరోగ్య పరిస్థితి దిగజారకుండా కాపాడమంటూ వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు, ఆశ అమ్మా నాన్నలు. శిశువైద్య నిపుణులైన మా ప్రొఫెసర్ సురేంద్రనాథ్ గారిలో కూడా ఆశ బ్రతికి బయటపడుతుందన్న ఆశ మెల్లమెల్లగా చిగురించ మొదలెట్టింది.

అన్ని వ్యాధులు పైకి కన్పించవు. అన్ని బాధలు పైకి విన్పించవు. చికిత్స ప్రారంభించి నాలుగు వారాలయింది. ఆ రోజు ఆదివారం. రోగుల్ని పరీక్షించేందుకు ఆ వార్డులో అప్పుడే అడుగుపెట్టాను. రోగుల్ని వరుసగా చూస్తూ వెళుతున్నాను. నా మనసేమో ఆశను చూడాలన్న ఆత్రంతో ముందుకు పరిగిడుతూంది. ఆశ తల్లిదండ్రులు నాకై నిరీక్షిస్తూ వుంటారు. ఆశ అయితే చెప్పనే అక్కర్లేదు. నేను వార్డుకొచ్చే టైంకి పక్కమీంచి లేచి నుంచొని వార్డు తలుపుకేసి ఆశగా చూస్తూ వుంటుంది. నాతో అప్పుడప్పుడు హాస్యమాడుతూ వుంటుంది. నన్ను సూదులతో గుచ్చి గుచ్చి బాధపెట్టడం కోసరమే తనూ డాక్టరవుతుందట...

మేమిస్తున్న మందుల్లో మార్పులు, చేర్పులూ ఏమైనా అవసరం అవుతాయేమో అనే ఉద్దేశ్యంతో, మధ్యాహ్నాలు కూడా వచ్చి ఆశను పరీక్షించే వాడిని. ఒక్కోమారు ఆస్పత్రి నుంచి హాస్టల్‌కి వెళ్ళేముందు ఆశనొకమారు పలకరించి వెళ్లేవాడిని. ఆశ అమ్మా నాన్నలు అప్పుడప్పుడూ వాళ్ళకున్న సందేహాలు నన్నడిగి తీర్చుకునేవారు.

## నేరము-శిక్ష

నేరాలు నేతలివి
బాధ్యత భగవంతుడిది
అందరి అభివృద్ధి ఫలాలు
అందుతున్నాయి బలవంతుడికి
యంత్రాంగం చట్టాలు, కోర్టులు
కలవాడికి కవచ కుండలాలు
సామాన్యుడికి కందని పుల్లని ద్రాక్షలు
అతడి ఆవేదన అరణ్యరోదన
ఓటర్ల నోటు, మద్యం నేరం
పడింది అందరికీ ఐదేళ్ళ శిక్ష
రాజ్యాంగంలో లేదు తగ్గింపు క్లాజు
అనుభవించక తప్పదు ఐదేళ్ళు

-పరుచూరు శ్రీనివాసరావు

"డాక్టర్‌గారూ! ఆశను మేమెప్పుడు యింటికి తీసుకెళ్ళవచ్చు?"

"బహుశా.. ఓ రెండు మూడు వారాల్లో"

"నిజం చెప్పండి డాక్టర్ గారూ! క్యాన్సర్ని నిజంగా క్యూర్ చేయొచ్చా?"

"సందేహమెందుకు మీకు! పెద్దలతో పోలిస్తే- చిన్న పిల్లలలో ఈ వ్యాధి నివారణ అధికంగా వుంటుంది."

"అన్నెం పున్నెం ఎరుగని చిన్న పిల్లలకెందుకండీ ఈ వ్యాధి వస్తుంది."

"అలా అని ఏం లేదు. ఎవరికైనా ఈ వ్యాధి రావచ్చు. దేహంలోని కణాలు ఒక్కటొక్కటిగా విడిపోతూ, మల్టిప్లయ్ అవుతూ పోతాయి. అలా తయారైన కణాల సమూహం మిగిలిన దేహ భాగాన్ని తినేస్తూ పోతుంది. ఆహారం, ప్రాణవాయువు- ఆఖరికి రక్తం పూర్తిగా హరించుకుపోయి, ఆ భాగం నశిస్తుంది.

ఇలా, చిన్నా పెద్ద అని తేడా లేకుండా, ఏ వయసు వారికైనా ఈ వ్యాధి రావచ్చు. ఏ వయసు వారికైనా పూర్తిగా నయం కావచ్చు."

"ఊడిపోయిన ఆమె జుత్తు మళ్ళీ వస్తుందా.. డాక్టర్!"

"ఏం- ఎందుకా డౌటు! మందులు మానేశాక, రెండు నెలల్లో ఆమె జుట్టు మళ్ళీ తప్పక వస్తుంది. కాకుంటే, ఓ రెండేళ్ళపాటు, రెగ్యులర్‌గా మందులు తీసుకోవలసి వుంటుంది."

"పెద్దయ్యాక మా పాపకి పిల్లలు పుడ్తారా?"

"ఓ.. మీకా భయం అక్కరలేదు."

"క్యాన్సర్ అంటువ్యాధి కదా! తన చెల్లెలు పరిస్థితి ఏమిటి? మా బంధువర్గంలోని వారికెవరికైనా ఈ వ్యాధి వచ్చే అవకాశాలు వున్నాయా?"

"ఇది అంటువ్యాధి కాదు. జబ్బు ఒకరి నుండి మరొకరికి వచ్చే ప్రసక్తే లేదు."

ఇలా సాగిపోయేది, మా ప్రశ్నోత్తరాల కార్యక్రమం. ఆశకు, ఆమె తల్లిదండ్రులకు ఇప్పుడు నేనో డాక్టర్‌నే కాదు. వారు అభిమానించే మంచి స్నేహితుణ్ణి కూడా.

పాత సంగతులు నెమరేసుకుంటూ ఆశను సమీపించాను. ఆశ నవ్వుతోంది. ఎందుకో బాగా సంతోషంగా వుంది. ఆ ఉదయం ఆమె చెల్లెలు, తమ్ముడు (చిన్నాన్న కొడుకు) తనని చూసేందుకు వచ్చారట- వాళ్ళ గ్రామం నుండి.

ఆస్పత్రిలో బయట వున్న సువిశాలమైన గార్డెన్

## 'కాలానికి సంబరాలు'

కదిలిపోయే కాలమా!
నీకు పట్టాభిషేకం చేయాలని
దిక్కులన్నీ హారతులు పడుతున్నాయి
సూర్యోదయ- సూర్యాస్తమయాలు
నీ జ్ఞాపకాలు పంచుకొన్న పున్నమి రాత్రులు
నీతో పంచుకొన్న అనుబంధాలన్నీ
నీ రాకతో మాకు కొత్త ఊపిరిపోయాలి.
నీ తోటి చెలిమి పంచుకోవాలని
నీ వెంటే పరుగులు తీస్తూ
ఆశగా ఎదురు చూస్తున్నాము!
జీవితంలో ఎన్నో అపవాదులు
తీగ తెగిన వీణలా అపశ్రుతులెన్ని ఉన్నా
కాల తోరణంలో- సమస్యా పూరణమై
కొత్త క్యాలెండర్‌లో పన్నెండు నెలలు చూపి
ఒక్కొక్కటి గడిచేకొద్దీ ఎన్నో టెన్షన్లే.
నిన్నటి గతాన్ని ఓదారుస్తూ- రేపటి తీర్పు చెప్తావు.
ఎన్నెన్నో మార్పులు - చేర్పులు - ఇంకెన్నో
ఓదార్పులు / అన్నిటికీ చెప్తావు తీర్పులు
ప్రమోషన్లు - ఎమోషన్లు / సస్పెన్స్ - థ్రిల్లర్లతో
సెంటిమెంట్లు - పనిష్మెంట్లతో జీవితం
కాకూడదు ఎగ్రిమెంటు!
ఎక్సలెంట్ నీ రాక ఒన్స్‌మోర్ అంటూ
తరలిరావే నూతన తీరమై
పాడుకోవాలి మనోగీతమై
నీతోటి చెలిమి - కావాలి కలిమి
నిను వీడని ప్రతి క్షణం మాకొక వరం
ఎన్నో ఆశలతో నీ ఎదలో దాచుకొని
ఆదరించినా నీవే - ఆగ్రహించినా నీవే
బ్రతుకు సమరంలో భవిత బంగారం కావాలని
నూతన సంవత్సర వేడుకలతో
కాలానికి సంబరాలు జరుపుకొనే వేళ
అంకెల సంఖ్యల గారడితో కాలానికి
రాసుకొన్న మనోగీతంలో
అపశ్రుతులు లేకుండా అంధకారం రాకుండా
కొత్తదనానికి కొత్త రంగులు వేసి
మనిషిని మనిషిగా తీర్చిదిద్దాలి.
మానవత్వపు పరిమళాలను వెదజల్లాలని
కాలమా నీకు పట్టాభిషేకం
పంచాలి అందరికీ అమృతాభిషేకం.

-తాటికోల పద్మావతి

లోని లాన్‌లో ప్రశాంతంగా కూచుని కబుర్లు చెప్పుకో వచ్చు. ఇంటినుండి తనకోసం తెచ్చిన పండ్లూ, తిను బండారాలు వారితో కలిసి ఎంచక్కా తినొచ్చు.

నా అనుమతి కోసం నా కళ్లలోకి చూసింది ఆశ.

## మెరుగు నానీలు

అది అతి గొప్ప
నాగరిక దేశం
దాని సంస్కృతి
దురాక్రమణం
సరస్సులో
కలువలు కమలాలు
అంతరంగం పొందిన
అందాలు ఆనందాలు
యాత్రలు
విజ్ఞాన వినోద విహారం
కమనీయం
అనుభవ సారం.
పూర్ణిమ
అరవిరిసిన తేజస్సు
అమావాస్య
అరకమ్మిన తమస్సు
సెలయేరు
జల గమనపు బాట
సరస్సు
జల నిర్బంధపు కోట
శుక్ల పక్షం
వెన్నెల పెరుగు
కృష్ణ పక్షం
చీకటి పెరుగు - ఇదేం పెరుగు?
ముల్లులా ఉంటావా?
మూర్ఖ లక్షణం
పూవులా జీవించు
కీర్తి పరిమళం
కవిత్వము
అక్షరాల జాలు
ఉపన్యాసము
మాటల ఊటలు.

-రేగులపాటి కిషన్‌రావు

తల ఊపాను, 'నిన్ను పరీక్షించాక వెళ్లువుకానీ' అంటూ.

"ఏ కాంప్లికేషన్లు లేకపోతే సాయంత్రం వరకూ గార్డెన్‌లో వాళ్ళతో గడిపిరావచ్చులే" అని కూడా అన్నాను.

ఆశ అమ్మ నన్ను పక్కకు పిల్చింది.

ఎందుకో ఆమెలో కొంచెం భయం తొంగి చూస్తోంది. "డాక్టర్‌గారూ! ఆశ తొడమీద ఓ నల్లటి మచ్చను గమనించాను ఈ ఉదయం" అంది.

"ఏదీ, చూడనీ!" అన్నాను, ఆశకేసి చూస్తూ.

వాళ్ళమ్మ నాతో అన్న మాటను చిటికెలో అర్థం చేసుకుంది ఆశ. ఆమె చాలా తెలివైన పిల్ల.

ఆశ, తన తొడమీది నల్ల మచ్చను చూపింది నాకు.

"ఏం కాదులే!" అన్నాను ఓదార్పుగా ఆశ అమ్మకేసి చూస్తూ. ఆస్పత్రి ప్రోటోకాల్ అనుసరించి ఆ మచ్చ విషయం, ఆశ ఫైల్లో నోట్‌చేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాను.

ఆ రోజే ఆశ మచ్చ విషయం మా ప్రొఫెసర్‌కి తెలియజేశాను.

రోజులు దొర్లిపోతున్నాయి...

మళ్ళీ ఓ ఆదివారం.. ఆశను పరీక్షిస్తున్నాను. బాగా ఏడ్చినట్లుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి. ఒళ్ళు కూడా వేడిగా వుంది.

టెంపరేచర్ చూసి, రక్తపరీక్ష కోసం, బ్లడ్ శాంపిల్ డ్రా చేసి లాబ్‌కి పంపాను.

"ఆశా! ఏమయింది నీకు? ఎందుకంత డల్‌గా వున్నావ్? జ్వరం తగ్గిపోతుందిలే. మందులు రాశాను. నర్స్ వచ్చి యిస్తుంది. యాంటీ బయోటిక్స్ కూడ అవసరమైతే స్టార్ట్ చేస్తాను. ఓ.కే!"

"అందుకు కాదు డాక్టర్! చూడండి- మా తమ్ముడు, చెల్లీ నన్ను చూడ్డానికి ప్రతి ఆదివారం తప్పక వస్తారు కదా! కానీ, ఈ రోజు రావడం లేదని కబురెట్టారు. వాటె బోర్!" అంది కాస్త విసుగ్గా.

"పోనీలేమ్మా! నీకు ఒంట్లో బాగా లేదు కదా! చక్కగా రెస్ట్ తీసుకో!" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాను.

సోమవారం వచ్చి చూశాను. తొడమీద మచ్చ ఇంకాస్త పెద్దదయింది. ఆ మచ్చ చుట్టూతా వాపు కూడా గమనించాను. జ్వరం కూడా తగ్గలేదు. అన్నపానాదులు నిరాకరించింది ఆశ. ఐవీ ఫ్లూయిడ్స్ యివ్వడం మినహా మరో మార్గం కన్పించలేదు. మంగళవారానికి మరీ పెద్దదయింది మచ్చ. విపరీతమైన నొప్పి.

బాధను భరించలేక కుమిలి కుమిలి ఏడుస్తోంది ఆశ.

రక్త పరీక్ష ఫలితాలు చేతికందాయి. మచ్చ వున్న ప్రాంతం సుడోమొనాస్ (Pseudomonas) అనే భయంకరమైన బాక్టీరియాతో ఇన్‌ఫెక్ట్ అయినట్లు నాకు తెలిసిపోయింది.

బుధవారానికి ఆశ బీపీ నెమ్మది నెమ్మదిగా పడి పోవడం గమనించాను. ఊపిరి తీసుకోవడానికి అవస్థ పడుతోంది. ఆక్సిజన్ యివ్వడం ప్రారంభించి, ఐసీ యూకి షిఫ్ట్ చేశాం.

కూతురు ఆరోగ్య పరిస్థితి వున్నట్లుండి క్షీణించ డంతో ఆశ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఇన్‌ఫెక్షన్ తగ్గించడం మా తరం కావడంలేదు. ఆశ తల్లిదండ్రు లను కూడా సముదాయించలేకపోయాం. ఆశ దుర్బల శరీరంతో క్యాన్సరు ఆటలాడుకుంటోంది. ఎంత మంచి మందులు వాడినా ప్రయోజనం కనిపించడంలేదు.

రోజురోజుకి ఆశ ఆరోగ్యం క్షీణిస్తోంది. తాము ఎంతగానో ప్రేమించే చిన్నారి ఆశ తమకు దక్కు తుందా!? వారి మొహాల్లో వున్న రవ్వంత సజీవతా కనుమరుగవుతోంది. ఏ క్షణాన్నైనా తమ చిన్నారి తమకు దూరం కావచ్చునన్న నిశ్చితాభిప్రాయానికి ఆశ తల్లిదండ్రులు వచ్చినట్లు నాకు తెలిసిపోయింది.

ఆ రోజు రోగులను పరీక్షించి వెళ్ళిపోతున్న నన్ను- "డాక్టర్ అరుణ్!" అంటూ, ఆర్ద్రంగా పిలిచింది ఆశ.

"ఏమ్మా, ఆశా!" అన్నాను, అనునయంగా.

"నిజం చెప్పండి డాక్టర్- నేను బతుకుతానా?" అప్పటివరకు ఎంతో నిబ్బరంగా ఉన్న ఆశ ప్రశ్న.

చాలా కష్టమైన ప్రశ్న. ఆశ నన్నీ ప్రశ్న అడుగు తుందని నేను ఊహించలేదు. ఆమె ప్రశ్న నన్ను నివ్వెర పరిచింది. పదేళ్ళ పసిపాప నా పేరు సంబోధిస్తూ ఎంత సూటిగా అడుగుతున్నది!

ఆశకేమని సమాధానం చెప్పాలి?

వెళుతున్నవాడినల్లా ఆగిపోయాను. ఆశ అడిగిం దేమిటో వినబడనట్లు నటించాను. స్టెతస్కోపు తీసి ఆశ గుండెల మీద వుంచాను. గుండె చప్పుళ్ళు నీర సంగా వినిపిస్తున్నాయి. మానిటర్స్‌కేసి చూశాను. ఏ ఒక్కటైనా స్వస్థతా సంకేతాలు సూచిస్తాయేమోనని ఆశ పడ్డాను. ఊహూఁ ఆశలో జీవకళ సన్నగిల్లిపోతోంది.

"డాక్టర్ అరుణ్! నిజం చెప్పండి.. నేను బతుకుతా నంటారా?" మళ్ళీ అదే ప్రశ్న. నాకు సమాధానం యిచ్చి తీరాలి అని నిగ్గతీస్తున్నట్లు వుందా ప్రశ్న.

అందరూ నాకేసి చూస్తున్నారు.

అంకిత భావంతో పనిచేసే జూనియర్ డాక్టర్లు.. నర్సులు.

ఆశకు అటూ-ఇటూ వున్న రోగులు..

అహరహం ఆశను అంటిపెట్టుకుని కాపాడుకుం టున్న ఆమె తల్లిదండ్రులు...

అందరూ.. అందరూ... ఆశ కళ్ళలోకీ మానవీ యంగా చూస్తున్నారు. ఈమారు ఆరాటంగా, ఆత్రంగా, నా కళ్ళల్లోకి చూసింది ఆశ. పదేళ్ళ పసిపాప.. బంగారు తల్లి.. స్కూలు, టీచర్లు, క్లాసు పిల్లలు, ఆటలు, పాటలు, ఆకతాయి చేష్టలు- ఇవి తప్ప మిగిలినవేవీ అవసరంలేని, అక్కరలేని, ఉరకలేసే జలపాతం లాంటి వయసులో వున్న చిన్నారికి, ఎందుకొచ్చిన క్యాన్సరు, హాస్పిటల్, ఆంకాలజిస్ట్.. ఇలాంటివన్నీ! ఉసూరు మంది నా మనస్సు.

గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుంటూ, సాంత్వనంగా, ఉపశమనంగా అన్నాను.

"ఆశా! నీకేం భయంలేదమ్మా. నువ్వు తప్పకుండా బతుకుతావ్. పెద్దదానివై డాక్టరువౌతావు. అంతేకాదు ఆశా, నాకేదైనా జబ్బు చేస్తే ట్రీట్‌మెంట్‌కి నీవద్దకే వస్తాను. నువ్వు నన్ను సూదులతో గుచ్చి గుచ్చి మంది వ్వాలి కదా!"

ఎంత పచ్చి అబద్ధం. ఈ పసిదాన్ని నేను మోసం చేయడం లేదు కదా!

ఆశ నవ్వింది. అసంకల్పితంగా నవ్వింది. నైరా శ్యపు నూతి లోతుల్లోంచి వస్తోందా నవ్వు. రుజా బాధతో తల్లడిల్లిపోతూ, కళ్ళనిండా నీరు నింపుకుంటూ, "థాంక్యూ డాక్టర్" అని మాత్రం అనగలిగింది.

మరుక్షణంలో ఆమె మొహంలో ఏదో కొత్త ఆశ

## జీవనయానం

సుఖానుభోక్తనైనప్పుడు
నీ నామస్మరణ విరమించి
నిన్ను విస్మరిస్తానని
సందేహమా ప్రభూ!
అయితే కడవరకు
ఈ కష్టాలతోనే నా జీవనయానం సాగిస్తూ
నిరంతరం నిన్నే.. నిన్నే
నా మనసు నిండా నిలుపుకోనీ.

-గోవిందరాజు రామకృష్ణారావు

పొడచూపింది. ఆశే మనిషిని బతికిస్తుంది. చిగురించిన ఆశలతో ఆ బాలిక నావేపు చూస్తుండగా ఐసియూ నుండి బయటకు నడిచాను.

ఆ రోజు ఆశతో భయంకరమైన అబద్ధమాడాను. నన్ను నమ్మి, అశ్వినీ దేవతగా భావించి అభిమానించే ఓ అభం శుభం ఎరుగని బాలికతో అబద్ధమాడానన్న అపరాధ భావంతో హాస్టల్ చేరుకున్నాను.

❖ ❖ ❖

ఆ తర్వాత జరిగిన పరిణామాలకు నా వద్ద ఖచ్చితమైన సమాధానం లేదు- అప్పుడే కాదు, ఇప్పటికి కూడా.

బ్రతకాలన్న బలీయమైన కోర్కె, దృఢసంకల్పం ఆ బాలికలో పనిచేశాయో, నేనందించిన భరోసా ఓ టానిక్కులా పనిచేసి ఆ పాపలో నూతన తేజాన్ని నింపిందో- మొత్తానికి రెండు వారాల్లో ఆశ ఆరోగ్యంలో అనూహ్యమైన మంచి మార్పులు కనిపించ సాగాయి. మాటల సందర్భంలో మా ప్రొఫెసర్ సురేంద్రనాథ్‌గారి వద్ద ఈ ప్రస్తావన తెచ్చాను. "డాక్టర్ అరుణ్! నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. అంతేకానీ లేనిపోని ఆశలు ఆ పిల్ల తల్లిదండ్రులలో మొలకెత్తనీయకు" అంటూ, నన్ను మైల్డ్‌గా మందలించారాయన.

మృత్యు ముఖంలోంచి బయటపడిన ఆశ, ఇక వెనుతిరిగి చూడలేదు. ఓ మూడు వారాల్లో సంపూర్ణ ఆరోగ్యవంతురాలైంది.

ఆ రోజు ఆశ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి యింటికి వెళ్ళిపోయే రోజు. నన్ను చూసి మంచం మీద నుంచి హుషారుగా దిగింది. మళ్ళీ పూర్వపు ఉల్లాసం, వెలుగు ఉట్టిపడుతున్నాయి ఆ పసిదాని మొహంలో.

"డాక్టర్ చూడండి, నా తొడమీద ఈ నల్ల మచ్చ. ఎంత అసహ్యంగా ఉందో చూడండి. దీనికి కారణం ఎవరు? మీరే కదూ!" నన్ను ఆట పట్టిస్తున్నట్లు, నాకేసి చూస్తూ నవ్వింది, ఆశ.

నిజమే! ఆ మచ్చ వున్న చోట, స్కిన్ గ్రాఫ్టింగ్ అవసరం అనిపించింది నాకు.

డిశ్చార్జ్ చేసేముందు తను తీసుకోవలసిన మందులు, జాగ్రత్తలు విశదీకరించి చెప్పాను. రివ్యూకి నెలకొకమారు తప్పక రావలసి వుంటుందని కూడా చెప్పాను.

మా అందరి వద్ద సెలవు తీసుకుని యింటికెళ్ళిపోయింది ఆశ.

కొన్ని నెలలు గడిచిపోయాయి.

ఒకరోజు రోగి ఫైలు మీద ఏదో స్క్రిబిల్ చేస్తూ బిజీగా వున్నాను. ఆశ పరుగున నా వద్దకు వచ్చింది. నాకేసి అభినందన పలకరింపుగా నవ్వుతూ, "గుడ్ మానింగ్ డాక్టర్!" అంది. "గుడ్ మానింగ్ ఆశా!" అన్నాను.

"ఇటు చూడండి!" తన తొడమీద నల్ల మచ్చ వున్న స్పాట్ చూపింది నాకు.

ఆశ్చర్యం! వికృతంగా, నల్లగా రెండంగుళాల వ్యాసార్ధం విస్తరించి వున్న ఒకప్పటి నల్లమచ్చ మచ్చుకైనా కనిపించడంలేదు. నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. పరీక్షగా రెండోమారు చూశాను. చిన్న స్కార్ కూడా లేదక్కడ. మిగిలిన శరీరంలోని చర్మం వలే అక్కడి చర్మం కూడా గులాబీ వర్ణంతో మిలమిలా మెరిసిపోతోంది!

నిశ్చేష్టుడినైపోయాను.

ప్రాన్పడిపోయాను. ఇది భ్రమా! నిజమా?? రోజులు దొర్లిపోతున్నాయి.

ఆశ క్రమం తప్పకుండా మా పీడియాట్రిక్ క్లినిక్కి రివ్యూ కోసం వస్తూనే వుంది. ఆ పాప వచ్చిందంటే వార్డంతా పిల్లల పకపకలతో పల్లవించేది. రంగుల హరివిల్లులతో వెల్లివిరిసేది. రెండేళ్ళ తరువాత, ఆ పాప జబ్బు పూర్తిగా నయమయినట్లు ప్రకటించాము.

'Never give up hope on any patient' అంటూ, అన్యాపదేశంగా నాకు తెలియజెప్పి నాలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, నన్నో మంచి డాక్టర్ని చేసిన పదేళ్ళ పసిపాప, ఆశ అంటే, యిప్పటికీ నాకు ఎనలేని అభిమానం.

■

*(ప్రస్తుతం అమెరికాలోని రాచెస్టర్‌లో డాక్టరుగా పనిచేస్తున్న మా అన్నయ్య గారి మనుమడు, డా॥ అరుణ్ శ్రీవత్స స్వీయానుభవానికి స్వేచ్ఛా కథనం)*

## శిలావిలాపం!

ఎన్ని ఉలిదెబ్బలకు
తట్టుకున్నావో
ఎల్లోరాగా మారడానికి!
ఎన్ని ఎదురు దాడులకు
గురయ్యావో
'స్త్రీ'గా నిలబడ్డానికి!

**–జి. జి. కె. రావు**